


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :298 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 24 సెప్టెంబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## ఏపీలో అక్టోబర్ 12 నుంచి స్కూళ్లకు దసరా సెలవులు



**అమరావతి సింధూరదర్శిని:** ఏపీలోని పాఠశాలలకు అక్టోబర్ 12 నుంచి 21 వరకు దసరా సెలవులు ప్రకటించారు. అయితే, రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. క్రిస్టియన్ ఎయిడెడ్ పాఠశాలలకు క్రిస్మస్ సెలవుల కారణంగా షెడ్యూల్లో స్వల్పమార్పులు ఉంటాయి. తెలంగాణలో అక్టోబర్ 10 నుంచి 22వరకు దసరా సెలవులు ప్రకటించారు.

## తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వివరాలు 2 లో



# కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు?

## క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

- 'సర్' సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నామన్న ఈసీ
- ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చెప్పారన్న వార్తలను ఖండించిన అధికారులు
- కొన్ని అంశాలపై వారు పరిశీలనలు మాత్రమే చేశారని వెల్లడి
- 14 సందర్భాల్లో అభ్యంతరాలంటూ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- ఓటర్ల జాబితా కచ్చితత్వమే 'సర్' లక్ష్యమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. ఇటీవల 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు మిగతా 2లో...




# అమరావతిలో ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం

- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ నిపుణులు
- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ సంస్థకు సీఎం చంద్రబాబు భూమి పూజ



**అమరావతి సింధూరదర్శిని:** రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు అడుగులు పడ్డాయి. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. మిగతా 2లో...



## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

- ఎన్నికల కమిషన్‌పై ప్రియాంకగాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని మిగతా 2లో...

# అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు

- కూటమి క్లీన్ స్వీప్ చేయాలి: మంత్రుల భేటీలో నారా లోకేశ్
- స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్న లోకేశ్
- ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని వ్యాఖ్య
- ఉపాధ్యాయులపై దాడి చేసిన వారు పరారయ్యారని ఎద్దేవా

**అమరావతి సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజా ప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ,



అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై మిగతా 2లో...




# భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- జ్వరాలు, విరేచనాల కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- మందులు, అంబులెన్సుల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- వైద్యులు,సిబ్బంది సెలవులు రద్దు ..కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- గర్భిణులు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు అవసరం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి సింధూరదర్శిని:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వర్షాలు, వరదల కారణంగా జ్వరాలు, విరేచనాల కేసులు పెరగకుండా ముందస్తు



చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య బృందాలు, మందులు, పరీక్షా పరికరాలు, అంబులెన్సులను సిద్ధంగా మిగతా 2లో...



## కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు? క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది.

ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

(మొదటిపేజీ తరువాయి)

వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

## అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు..

(మొదటిపేజీ తరువాయి)

గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

## అక్టోబర్ 17న, న్యూఢిల్లీలో... మావాసవీ దుర్గాపూజ




తెనాలి సింధూరదర్శిని: అభీష్టాలు నెరవేర్చే దుర్గమ్మ పూజకు సహ్ తైన్ బాంకెట్ హాల్ వేదికగా ఆదిలీల ఫౌండేషన్ ఆద్వర్యంలో అక్టోబర్ 17వ, తేదీన ప్రాధాన్యత చాటనుందనే చెప్పాలి. మావాసవి దుర్గాపూజలో భక్తులందరు భాగస్వాములై, పూజా విధులలో పాల్గొనడంతో పాటుగా, కార్యక్రమ నిర్వాహలో తోడ్పాటు నివ్వాల్సిన అవసరం ఉంది. న్యూఢిల్లీ మహానగరంలో డిఎల్ఎఫ్ గ్రీన్స్, సహ్ తైన్ బాంకెట్ హాల్ నందు అక్టోబర్ 17న, ఉదయం 9గంటలకు, అత్యంత వైభవంగా నిర్వహించే మా వాసవీ దుర్గా పూజలో ఆద్యాత్మికాభిలాషులంతా హజరై, పూజా విధులు తిలకించి, తీర్థ ప్రసాదాలు, మహాప్రసాదం స్వీకరించే భాగ్యాన్నిపొందాలని, ఫౌండేషన్ బాద్యులు ఓప్రకటన ద్వారా కోరారు.

# అమరావతిలో ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

సుధా, వెంకట్ జాస్తి క్యాంపస్ పేరుతో 12 ఎకరాల్లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించనున్నారు. ఏటా సుమారు 3 లక్షల మందికి కంటి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణం కానుంది. చికిత్సలతో పాటు నేత్ర వైద్య పరిశోధన, శిక్షణ, కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలపైనా సంస్థ దృష్టి సారించనుంది. ప్రత్యేకంగా ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి... శరవేగంగా నిర్మితమవుతున్న అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రావడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 3 కోట్ల కంటి చికిత్సలు అందించిన సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. అమరావతి కేంద్రాన్ని ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య పరిశోధన సంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ రంగాల్లోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. పేదలకు కంటి వైద్యం అందించడంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 319 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు సకాలంలో చికిత్స అందించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. అమరావతిలో ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను సీఎం అభినందించారు.



**క్వాంటం కేంద్రంగా అమరావతి**

ఇప్పుడు అమరావతి గురించి దేశం అంతా మాట్లాడుతోందని...మన ప్రజా రాజధానిని ప్రపంచం కూడా గుర్తిస్తోందని సీఎం అన్నారు. నోపోల్ సిటీ, బ్లూ-గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు విస్తృతంగా హరిత ప్రాంతాలను అభివృద్ధి చేసి, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఐటీ తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు అవుతోందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఐదు క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు మూడు క్యూబిట్ కంప్యూటర్లను తయారు చేశాయని పేర్కొన్నారు. అక్టోబరు 3న వివిధ విశ్వవిద్యాలయాల్లో క్వాంటం కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**రాజధానిలో రూ.50 వేల కోట్ల పనులు**

అమరావతిలో ప్రస్తుతం సుమారు రూ.50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక మౌలిక వసతులు రానున్నాయని చెప్పారు. విట్, ఎస్ఆర్ఎం, అమృతానందమయి సంస్థలు ఇప్పటికే వచ్చాయని, త్వరలో బిట్స్ పిలానీ క్యాంపస్, ఎక్స్‌ఎల్ఆర్ఐ వంటి సంస్థలు కూడా రానున్నాయని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌లో భాగంగా బసవ తారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ, ల్యాబొరేటరీ ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీ, క్వాంటం బయో వ్యాలీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరావతిలో బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా రాజధాని రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

**అక్టోబరు 3న పాన్-ఐఐటీ సదస్సు**

అక్టోబరు 3న విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీల్లో చదివి ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొని మేధోమథనం చేయనున్నారని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్-ఐఐటీ పనిచేస్తోందన్నారు. భవిష్యత్తులో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు అమరావతి కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు, పరిశోధనలకు గమ్యస్థానంగా రాజధాని నిలవాలని ఆకాంక్షించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కంటి వైద్యం, పరిశోధన, చికిత్స, శిక్షణలో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. సాంకేతికత, అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు జి.ఎన్ రావు తదితరులు హాజరయ్యారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంచాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో చర్చించిన సందర్భంగా బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామ రాజు, తిరుపతి, ఏలూరు, పార్వతీపురం మన్యం, ఎస్‌పీఎస్ నెల్లూరు, మార్కాపురం, కాకినాడ, శ్రీకాకుళం జిల్లాలతో పాటు పోలవరం ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వర్ష ప్రభావిత, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి ప్రభావిత ప్రాంతంలో వైద్యాధికారి, పర్యవేక్షణ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైన మందులు, పరీక్షా సామగ్రి తగినంతగా నిల్వ చేసుకోవాలని సూచించారు.

**తాగునీరు.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ**

వర్షాలు, వరదల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు నీటి వనరులకు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు అందేలా చూడాలని ఆదేశించారు. సదరు ప్రభుత్వ శాఖలతో కలిసి నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని, ఇళ్లు, పాఠశాలలు, సహాయ శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో దోమలు పెరగకుండా చూడాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ఆసుపత్రుల్లో జనరేటర్లను సిద్ధం చేయాలి**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో జనరేటర్లు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. రహదారులు దెబ్బతిన్నా అత్యవసర వైద్య సేవలు కొనసాగేందుకు కనీసం రెండు అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వరదలు, ఇతర ప్రమాదాల నుంచి రక్షించిన వారికి వెంటనే వైద్యం అందించాలని తెలిపారు.

**గర్భిణిలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు అవసరం**

వారం రోజుల్లో ప్రసవమయ్యే అవకాశం ఉన్న గర్భిణిలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో టీకాలను సురక్షితంగా నిల్వ చేసే ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. వరద నీరు తగ్గిన వెంటనే దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కాలువలు, నీటి గుంటలు, గుంతలు, నీరు నిలిచే ఇతర ప్రదేశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలు, తీర ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, వరద ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. అసాధారణంగా కేసులు పెరిగినా, ఒకే ప్రాంతంలో ఎక్కువ కేసులు నమోదైనా, మందులు లేదా సిబ్బంది కొరత ఏర్పడినా సాధారణ నివేదిక కోసం వేచి ఉండకుండా వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. తుఫాను సమయంలోనే కాకుండా వర్షాలు, వరదలు తగ్గిన తర్వాత కూడా కొంతకాలం ప్రత్యేక చర్యలు కొనసాగించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

**వైద్యుల సెలవులు రద్దు.. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

తుఫాను పరిస్థితుల నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది సెలవుల రద్దు చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు. అలాగే ఇతర చర్యల గురించి వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. అలాగే పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రికి చక్రధర్‌బాబు తెలిపారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు

మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ

సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.

అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు.

ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వెదురూరులో సంకల్ప సేవా అభియాన్.. రక్తదానంతో స్ఫూర్తిదాయకం




చాపాడు (సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ కడప జిల్లా ; చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెదురూరు ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంతో పాటు, ప్రధాన కార్యదర్శి మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వైద్య శిబిరం తో పాటు రక్త దాన శిబిరాన్ని నిర్వహించారని వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని జమ్మల మడుగు డిప్యూటీ డి యం హెచ్ ఓ డాక్టర్ గీతా రెడ్డి, చాపాడు మండల బిజెపి అధ్యక్షుడు లోమడ సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 10 మంది సభ్యులు రక్త దానం చేశారని, వారికి ఆపిల్ పండ్లు, జ్యూస్ బాటిల్స్ అందించారు.వారిని గీతారెడ్డి, బి జె పి నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు నుండి వచ్చిన బ్లడ్ డొనేషన్ క్యాంపు బృందం ఆధ్వర్యంలో రక్త సేకరణ నిర్వహించారు, డాక్టర్ పైలా భాను, మైక్రోబయాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ 17 వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించి ప్రత్యేక యోగా సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది అమరావతి, పార్వతీ.జయలక్ష్మి, రాజమ్మ, భారతీ,చురుకుగా పాల్గొన్నారని, వీరు చిన్నారులకు,గర్భవతులకు, బాలింతలకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషక సేవలపై అవగాహన కల్పించారనీ డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ ఈఓలు, వెంకటేశ్వర్లు, జయ ప్రకాశ్, సూపర్ వైజర్స్ ప్రసాద్, భవానీ, ఎ ఎన్ యం లు,, యం ఎల్ హెచ్ పి లు, ఆశా కార్యకర్తలు,బి జె పి నాయకులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, రక్త దాతలు, వెదురూరు మరియు పరిసర ప్రాంతాల ప్రజల సహకారంతో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం విజయవంతం చేసినట్లు నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



గూడూరు( సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కార్యదర్శి లయన్ పప్పు వీరేంద్రనాథ్ సహకారంతో వారి తండ్రి కీ॥శే॥ పప్పు రాఘవేంద్ర రావు వర్ధంతి సందర్భంగా చిన్నకుమ్మరి వీధి కూడలి నందు అన్నదాన కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ కలగట్ల శివయ్య కార్యదర్శి లయన్ పప్పు వీరేంద్రనాథ్ కోశాధికారి లయన్ రావూరు రవిచంద్ర జోన్ 12 చైర్మన్ లయన్ యం రూపేష్ రెడ్డి డిస్ట్రిక్ట్ చైర్మన్లు యం జె ఎఫ్ లయన్ యం మురళి రెడ్డి ఎం జె ఎఫ్ లయన్ వాకాటి రామమోహన్ పాస్ట్ ప్రెసిడెంట్లు లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి లయన్ అక్కన రమణయ్య లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ జి రామచంద్రయ్య లయన్ చింతల రాఘవయ్య లయన్ ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంత అవసరం



శ్రీకాళహస్తి (సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ తిరుపతి జిల్లా; శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీలో స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా పోషణమహోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గ సూచనలతో ఎల్లంపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసరోత్సవం నిర్వహించారు ఎల్లంపల్లి గిరిజన కాలనీలో గర్భిణీలు బాలింతలు కిషోర్ బాలికలకు పౌష్టికాహార అవగాహన సదస్సు పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బారింతలు కిషోర్ బాలికలు, చిన్నారులు ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరం అని తెలిపారు గర్భధారణ నుండి పిల్లలు పుట్టిన వెయ్యి రోజుల వరకు వారి శారీరిక మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమని తెలిపారు.పిల్లల వయసు కనుగుణంగా పౌష్టికాహారం అందించడం గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి వివరించారు ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్థానికంగా లభించే ఆకుకూరలు కాయగూరలు పండ్లు పోషక విలువలు కలిగిన పదార్థములను చిరుధాన్యాలను తీసుకోవాలని తెలిపారు. పౌష్టికాహార ప్రదర్శన వివిధ రకాల ఆహార పదార్థాలను పిండి వంటలను తయారు చేసి గర్భిణీలు బాలింతలకు అందించారు పౌష్టికాహారప్రదర్శన ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో కన్వీనర్ రామచంద్ర అంగన్వాడీ టీచర్లు పోలమ్మ శివకుమారి కళ్యాణి గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పై సీఎం సానుకూలం

**పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**

**సీఆర్డీఏ కమిషనర్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడిన నారాయణ**



విజయవాడ సింధూరదర్శిని: అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు త్వరితగతిన పరిష్కారం చూపే దిశలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు సానుకూలంగా ఉన్నారని పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేసారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సీఆర్డీఏ కమిషనర్‌తో పాటు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడి హౌసింగ్ స్కీమ్‌పై తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశకత్వంలో ఆయన ఆలోచనల మేరకు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతామని వివరించారు.బుధవారం విజయవాడ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు నారాయణను కలిసారు... సొసైటీ సభ్యుల గృహ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలను వివరించారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని మంత్రికి సమర్పించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 107, దాని అమలుకు సంబంధించిన విధివిధానాలు, హౌసింగ్ స్కీమ్‌పై తొలిగిపోయున న్యాయపరమైన అపోహలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి జారీ అయిన అన్ని జిఓలను పురపాలక పట్టణాభివృద్ధి శాఖే విడుదల చేసిందని, ప్రస్తుతం అమలు బాధ్యత కూడా ఆ శాఖపైనే ఉందని పత్రికా ప్రతినిధులు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. సొసైటీ ప్రతినిధుల వివరాలను విన్న మంత్రి నారాయణ...ఈ అంశాన్ని సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి ముందుకు తీసుకెళ్లతామని స్పష్టం చేశారు. సీఆర్డీఏ కమిషనర్‌తో మాట్లాడటంతో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో కూడా చర్చిస్తానని తెలిపారు. పాత్రికేయిల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, తమది జర్నలిస్టు స్నేహపూర్వక ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని నారాయణ అన్నారు. రాజధాని నిర్మాణం వేగంగా ముందుకు సాగుతున్న సమయంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని, వారి సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ అంశంపై గతంలోనే మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్ సొసైటీ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో సానుకూల వైఖరి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లే అవకాశాలను వారు వివరించారు. ఇప్పటి వరకు జరిగిన పరిణామాలకు కొనసాగింపుగా మంత్రి నారాయణ తాజాగా ఇచ్చిన హామీతో సీఆర్డీఏ స్థాయిలో తదుపరి ప్రక్రియ కదలికలోకి వస్తుందనే ఆశాభావం సొసైటీ ప్రతినిధుల్లో వ్యక్తమవుతోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ స్కీమ్‌కు ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం లభిస్తుందని వారు ఆశిస్తున్నారు.మంత్రి నారాయణ ను కలిసిన వారిలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి,ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ తిరువాయిపాటి శ్రీనాథ్, హన్స్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ శ్యామ్ సుందర్,ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెంట్ ఎడిటర్ మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణారావు, రామకృష్ణ (ఢిల్లీ) పాల్గొన్నారు.

# రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ

**పి జి ఆర్ ఎస్, హౌసింగ్ పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు వీడియో కాన్ఫరెన్స్**



తిరుపతి (సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ తిరుపతి జిల్లా; జిల్లాలో రీ సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, రీ సర్వే విధులకు వి ఆర్ ఓ లు విలేజ్ సెక్రెటరీలతో కలసి హాజరుకావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి రీసర్వే, పట్టాదారు పాసు పుస్తకం పంపిణీ, పి జి ఆర్ ఎస్, హౌసింగ్ పురోగతి పై ఆర్డిఓ లు, తహశీల్దార్లతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 18 తేదీలలో మంగళగిరి సిసిఎల్ఏ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్యక్షతన రెవెన్యూ, రీసర్వే అంశాలపై జాయింట్ కలెక్టర్లకు, ఆర్ డి ఓ లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులకు వర్క్ షాప్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారన్నారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, రీసర్వే కార్యకలాపాల వి ఆర్ ఓ లు విలేజ్ సెక్రెటరీ లతో కలసి హాజరు కావాలని తెలిపారు. 60 శాతం పనిదినాలను క్షేత్ర పర్యటనలకు కేటాయించాలన్నారు. రీ సర్వే పూర్తి చేయడం ద్వారా గ్రామ రెవెన్యూ రికార్డులకు సంబంధించిన ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి సంబంధించి రీ సర్వే ప్రక్రియతో అనుసంధానం చేసుకుని కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. జనవరి సైకిల్ నుండి ఆగస్టు సైకిల్ వరకు పంపిణీ చేయని అన్ని పాస్ పుస్తకాలను 2026 నవంబర్ చివరి నాటికి పంపిణీ చేయాల్సి ఉందని విఆర్ఓలు స్వయంగా పట్టాదారులను సంప్రదించి ఆదిశగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పిజిఆర్ఎస్ అర్జీలను ప్రతి రోజూ పర్యవేక్షించాలన్నారు. స్పీకింగ్ ఆర్డర్లలో అవసరమైన గ్రీవెన్స్ పిటిషన్లను ధృవీకరించడం ద్వారా ఆర్డీఓలు తహసీల్దార్లకు మార్గదర్శనం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితులను తహసీల్దార్లు, వి ఆర్ ఓ లు, విలేజ్ సెక్రెటరీలు పాటించేలా ఆర్‌డిఓలు నిర్ధారించుకోవాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ అనంతరం తహసీల్దార్ ద్వారా దరఖాస్తుదారునికి మ్యుటేషన్ చేయబడిన 1దీ/అడంగల్ కాపీని అందజేయడాన్ని పర్యవేక్షించడానికి ఆర్ డి ఓ కార్యాలయంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎల్ఏ గడువు దాటిన పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులను ప్రతిరోజూ పర్యవేక్షించాల న్నారు. 20 సంవత్సరాల తర్వాత ఫ్రీహోల్డ్‌గా మార్చబడిన అసైన్డ్ భూములను పట్టా భూములతో సమానంగా పరిగణించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 సాధనలో భాగంగా స్వల్పకాలిక లక్ష్యాలతో అర్హులైన కుటుంబాలన్నింటికీ డిసెంబర్ 2027 నాటికి గృహ స్థలాలను జారీ చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 15 లోపు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తిగా పరిశీలించాలని, ఇప్పటికే ఉన్న లేఅవుట్‌లలోని ఖాళీ ప్లాట్లను పరిశీలిచాలన్నారు. ఖాళీ ప్లాట్లు అందుబాటులో లేని చోట అక్టోబర్ 31వ తేదీ లోపు అర్హులైన లబ్ధిదారుల కోసం భూమిని గుర్తించాలన్నారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న భూమిని అర్హులకు కేటాయించాలన్నారు. గ్రామాల వారీగా భూమి అవసరం మరియు బడ్జెట్ ప్రతిపాదనలను నవంబర్ 1 వ తేదీ లోపు సమర్పించాలన్నారు.

## వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు





గూడూరు( సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి స్వామివారికి విశేష పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా విఘ్నేశ్వరునికి పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ ఏర్పాటు చేసి గణపతి హోమం పూర్ణాహుతి మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కోడూరు మీరా రెడ్డి కల్పలత కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## సిఎం సతీమణి భువనేశ్వరిని కలసిన రామచంద్రారెడ్డి



పెద్ద దోర్నాల, సింధూరదర్శిని: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతిమణి భువనేశ్వరుని బుధవారం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఐదు, ఆరు సంవత్సరాల నుండి ప్రజాహితమే లక్ష్యంగా గిరిజన ప్రాంతాల్లో, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివ భక్తులకు చేపట్టిన మెడికల్ క్యాంపులు, మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి సమయంలో శానిటైజేషన్, మాస్కులు పెద్ద ఎత్తున ప్రజలకు అందించిన సేవల గురించి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి భువనేశ్వరికి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, టిడిడి బోర్డు సభ్యులు వనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.




## వర్షపు నీటితో బనగానపల్లె బస్టాండ్‌లో ఆవరణలో మురుగు నీరు

**ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు -అధికారుల నిర్లక్ష్యం**

**సిపిఐ మండల కార్యదర్శి శివయ్య మండిపాటు**

బనగానపల్లె, సింధూరదర్శిని: బనగానపల్లె పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాండ్ ఆవరణలో మురుగు నీరు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు దోమలు బెడద ఎదుర్కొంటున్నారని సిపిఐ మండల కార్యదర్శి శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ నీరు నిలిచిపోతుందని, ప్రయాణికులు మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యను ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా అయితే మాకేంటి అన్నట్టు గా అధికారుల వ్యవహారిస్తున్నారు వెశీటనే పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మంత్రి బనగానపల్లె ను సుందరంగా తీర్చి దిద్దాలని మొక్కవోణీ దీక్ష తో ముందుకు వెళ్తుంటే ఒక వైపు అధికారులు మాత్రం మా రూటే వేరు అన్నట్టు వ్యవరిస్తున్నారు బస్టాండ్‌లో నిలిచిన మురుగు నీటిని వెంటనే తొలగించి,కొంచం లెవెల్ చేసి డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా మెరుగుపరచాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కొత్తూరు రాజు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్ ఆవిష్కరణ

జిల్లా కలెక్టర్, ఎస్పి లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా డ్రగ్ మెనేస్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ అనే మూడు అంశాలను సమగ్ర విధానంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది

జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు



తిరుపతి(సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ తిరుపతిజిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు మరియు పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్‌ను జిల్లా కలెక్టర్, ఎస్పి లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి శాంతిభద్రతల అంశం పై సమీక్ష సందర్భంగా డ్రగ్ మెనేస్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు వంటి మూడు ప్రధాన అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా సమగ్రంగా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మూడు అంశాలను కేవలం జిల్లా స్థాయిలో సమీక్షించడం కాకుండా మైక్రో లెవెల్ వరకు తీసుకెళ్లి, వార్డు, గ్రామ, పంచాయతీ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా పోలీస్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితర క్షేత్రస్థాయి సిబ్బందిని ఒక సమన్వయ బృందంగా ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో గృహ హింస, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఎదురయ్యే సమస్యలు వంటి అంశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కిశోర బాలికలకు మహిళా పోలీసుల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు మహిళలు, బాలికల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో అవగాహన, కౌన్సెలింగ్, పరీక్షలు, తనిఖీలతో పాటు డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, సరఫరా గొలుసుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాలేజీ విద్యార్థులు, వలస కార్మికులు, గతంలో డ్రగ్స్ వినియోగం లేదా సరఫరాతో సంబంధం ఉన్న వ్యక్తులు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి లక్ష్యిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగించే వారిని కౌన్సెలింగ్, అవగాహన, పునరావాసం ద్వారా సాధారణ జీవనంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడంతో పాటు, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యాసంస్థలు, సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎంఈఓలు, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో సమన్వయం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే పలు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ప్రమాదానికి కారణాలను విశ్లేషించి, రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను తక్షణమే గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అతివేగం, వాహనదారుల నిర్లక్ష్యం, రాత్రి వేళల్లో ప్రమాదాలు, రోడ్లపై నిలిచిపోయిన వాహనాలు, అలసటతో డ్రైవింగ్ చేయడం వంటి అంశాలతో పాటు లైటింగ్, సిగ్నలింగ్, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, క్రాష్ బ్యారియర్లు, సేఫ్టీ గార్డ్ రైల్స్, రహదారి క్రాసింగ్‌ల వద్ద భద్రతా చర్యలు వంటి ఇంజనీరింగ్ అంశాలను కూడా పరిశీలించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 48 బ్లాక్ స్పాట్లలో చేపట్టిన భద్రతా చర్యలను పోలీస్, రవాణా శాఖల ప్రమాణాల మేరకు పరిశీలించి, ప్రతి బ్లాక్ స్పాట్ వద్ద చేపట్టిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయా లేదా, ఇంకా ఏ అదనపు చర్యలు అవసరమో స్పష్టంగా నివేదిక అందించాలని డీటీసీని ఆదేశించారు. తదుపరి రెండు వారాల్లోగా అన్ని బ్లాక్ స్పాట్లను పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలు పూర్తయ్యాయా లేదా ధ్రువీకరించి నివేదిక సమర్పించాలని ఎస్‌డీపీవోలను కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను అత్యవసర ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. నిధుల లభ్యతను కారణంగా చూపకుండా, అందుబాటులో ఉన్న నిధులు, సేవింగ్స్ ఫండ్స్ తదితర మార్గాలను వినియోగించి అవసరమైన భద్రతా చర్యలను పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్లపై నిలిచి పోయిన వాహనాల వల్ల రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా సరైన పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రతి 15–20 కిలోమీటర్ల పరిధిలో అవసరమైన పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారుల వెంట ఉన్న దాబాలు, మద్యం విక్రయాలు తదితర అంశాలపై కూడా సంబంధిత శాఖలు నిబంధనల మేరకు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు 'గోల్డెన్ అవర్'లో అత్యవసర వైద్య సేవలు అందేలా పోలీస్, వైద్య ఆరోగ్యం, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సహాయం గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ, 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా డ్రగ్ మెనేస్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ అనే మూడు అంశాలను సమగ్ర విధానంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో మొదట అవగాహన, తర్వాత వినియోగదారులను గుర్తించడం–పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి పునరావాసం, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు అనే విధానాన్ని అనుసరించాలని తెలిపారు. గంజాయితో పాటు కొన్ని రకాల మాత్రలను కూడా మత్తు పదార్థాలుగా వినియోగిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, మెడికల్ షాపుల్లో వాటి విక్రయాలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు, వెలుతురు, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి లైటింగ్, సైన్ బోర్డులు తదితర భద్రతా చర్యలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి విద్య, మహిళా మరియు శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఆర్‌టీఏ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ సరఫరా గొలుసుపై ప్రత్యేక దృష్టి పెట్టి, సరఫరా చేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు మాత్రం కౌన్సెలింగ్, అవగాహన, పునరావాసం ద్వారా సహాయం అందించే విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాస రావు, శ్రీ లత, డీటీసీ మురళి మోహన్, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డీఈఓ కుమార్, ఐసీడీఎస్ పి డి వసంత బాయి, ఆర్ టీ సి ఆర్ ఎం శ్రీనివాస్ రావు, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పోలీస్, రవాణా, విద్య, వైద్య ఆరోగ్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఎస్‌డీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు

వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు

2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ

ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు

చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

అమరావతి సింధూరదర్శిని:

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.



గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120–బి, 149 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది. 2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# దహన సంస్కార షెడ్డు నిర్మాణానికి భూమి పూజలో క్రిష్ణకిశోర్

గిద్దలూరు సింధూరదర్శిని: పట్టణంలోని పి.ఆర్. కాలనీ దారి వద్ద హిందూ స్మశాన వాటికలో దహన సంస్కార షెడ్డు నిర్మాణానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవతా



స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఆపద సమయంలో అండగా నిలిచే సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పాలుగుళ్ళ శివారెడ్డి, సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు: జగన్

విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్

కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ

ప్రతి గ్రామంలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



అమరావతి సింధూరదర్శిని: వైసీపీ అధినేత జగన్ బుధవార విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



రేణిగుంట (సింధూర దర్శిని) 23 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; జిల్లా కు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24ఇ7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, సిడబ్ల్యూసి గోదామును బుధవారం జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు తో కలసి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతాఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్‌నాయక్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట భాగ్యలక్ష్మి, పవన్ సంబంధిత అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల నియోజకవర్గంలో రూ.2.43కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కర్లపాలెం సింధూరదర్శిని: బాపట్ల నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు. ఇందులో భాగంగా కర్లపాలెం పంచాయతీ పరిధిలో మొత్తం రూ.2.43 కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఎం.వి. రాజుపాలెంలో రూ.1 కోటి నిధులతో దండుబాట రోడ్డు నిర్మాణం, అలాగే రూ.1.43 కోట్ల నిధులతో ఎం.వి. రాజుపాలెం నుంచి తారకరామ ఎస్టీ కాలనీ వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ, ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.

# సాయికృష్ణ మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. హైకోర్టు విచారణపై స్టే

**కస్టడీలో వ్యక్తి మాయం కావడం చట్టవిరుద్ధమన్న కోర్టు – సెప్టెంబరు 30లోగా పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం**

**సీల్డ్ కవర్‌లో వివరాలు ఇవ్వాలని ఆదేశం – హైకోర్టు పిటిషన్లన్నీ బదిలీ చేయాలని ఆదేశాలు – అక్టోబరు 12న తదుపరి విచారణ**





అమరావతి సింధూరదర్శిని: గాదె సాయికృష్ణ మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసుల కస్టడీలో ఉన్న వ్యక్తి ఆచూకీ లేకుండా పోవడం చట్టవిరుద్ధమేనని స్పష్టం చేసింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేపడుతున్న విచారణపై స్టే విధించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సెప్టెంబరు 30లోగా సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 12కు వాయిదా వేసింది. సాయికృష్ణ కస్టడీలో ఉన్న సమయంలో ఏం జరిగిందన్న దానిపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సేకరించిన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సీసీటీవీ రికార్డుల్లో కీలక సమయానికి సంబంధించిన ఫుటేజీ అందుబాటులో లేదని గతంలో కోర్టు రికార్డుల్లో నమోదైంది. ప్రస్తుతం కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నుంచి పూర్తి వివరాలను సుప్రీంకోర్టు కోరింది.

**కేసు పూర్వాపరాలు**

గాదె సాయికృష్ణను 2026 మే 6న మార్కాపురం నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడలోని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు దర్యాప్తు రికార్డుల్లో ఉంది. అనంతరం అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచలేదని, ఆ తర్వాత అతడి ఆచూకీ తెలియలేదని ప్రాసిక్యూషన్ పేర్కొంది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి మృతిచెందేలా చేశారని, మృతదేహాన్ని కూడా మాయం చేశారని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. జూన్ 19న కేసు నమోదు కాగా, జూన్ 21న రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పటి కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజును సిట్ అరెస్టు చేసింది. ఆయనపై సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఉన్నాయి. అయితే కేసులోని ఆరోపణలు, దర్యాప్తులో తేలాల్సిన అంశాలపై తుది నిర్ణయం ఇంకా రావాల్సి ఉంది. తాజాగా సెప్టెంబరు 21న సిట్ విజయవాడ ఏసీబీ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో సాయికృష్ణను కస్టడీలో కొట్టినట్లు, అనంతరం రాణిగారితోటలోని ఓ ప్రైవేటు భవనానికి తరలించగా అక్కడ అతడు కుప్పకూలి మృతి చెందినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొంది. నిందితుల్లో ఒకరైన జి. సురేశ్ సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో సాయికృష్ణను పోలీసులు కొడుతుండగా తాను చూశానని, అనంతరం అతడు కుప్పకూలి చనిపోయినట్లు తెలిపినట్లు నివేదికలు వెల్లడించాయి. మృతదేహాన్ని ఆధారాలు లేకుండా చేసేందుకు దహనం చేసినట్లు కూడా సిట్ ఆరోపించినట్లు సమాచారం. ఈ కేసులో అప్పటి కృష్ణలంక సీఐ ఎస్ఎస్‌వీవీ నాగరాజుతో పాటు మరో ఆరుగురిని నిందితులుగా చేర్చారు.



## పల్లె పండుగ-3.0 కార్యక్రమానికి ముందస్తు భద్రతా ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ అధ్యక్షతన పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ సమీక్ష**

నెల్లూరు ( సింధూర దర్శిని ) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న "పల్లె పండుగ-3.0" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో, పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధ్యక్షతన బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ అంకమ్మరావు ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన బందోబస్తు అవసరాలు, వెన్యూ, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతం, పార్కింగ్ ప్రాంతాలు రూట్ మ్యాప్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, బందోబస్తు విభజన తదితర అంశాలను స్కెచ్ మ్యాపులు, విజువల్స్‌తో జిల్లా ఎస్పీ కి వివరించారు.

**భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ ముఖ్య సూచనలు**

సమీక్ష సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులకు పలు ముఖ్య సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తు ప్రణాళికను ముందస్తుగా సమగ్రంగా రూపొందించి, ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. వేదిక, హెలిప్యాడ్, రూట్, పార్కింగ్ ప్రాంతాలు, సభా ప్రాంగణం తదితర కీలక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన పోలీసు బందోబస్తును ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వి ఐ పి రూట్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా రూట్ డామినేషన్, యాక్సెస్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ తదితర చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.సభా ప్రాంగణంలో ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా నిర్ధారించి, ప్రజలు, వి ఐ పి లు, అధికారుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో ఎయిర్‌సైడ్ సెక్యూరిటీ, యాక్సెస్ కంట్రోల్, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం తదితర అంశాలను ముందుగానే సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సభా ప్రాంగణం మరియు వి ఐ పి రూట్‌లో అనుమతి లేని వ్యక్తులు, వాహనాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన యాక్సెస్ కంట్రోల్ అమలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల రాకపోకలు సజావుగా జరిగేలా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యమైన ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి, తమకు కేటాయించిన పాయింట్లను విడిచిపెట్టకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.కార్యక్రమానికి ముందు సంబంధిత ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు, రూట్ క్లియరెన్స్, యాంటీ-సాబోటేజ్ తనిఖీలు తదితర భద్రతా చర్యలను ప్రోటోకాల్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించే విధంగా పోలీస్, ఫైర్, మెడికల్, ట్రాఫిక్ తదితర విభాగాలతో సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.బందోబస్తులో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది విధులపై పూర్తి అవగాహనతో, సమయపాలనతో, సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎటువంటి లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన దిద్దుబాటు చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.అలాగే సంబంధిత అధికారులు తమ పరిధిలోని ఏర్పాట్లపై నిరంతరం సమీక్ష చేస్తూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమం సురక్షితంగా, ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అప్పారావు , నెల్లూరు రూరల్ ఘట్టంనేని శ్రీనివాసరావు గిరిధర్ బాబు , ఉమెన్ పోలీస్ స్టేషన్ వేమారెడ్డి , కావలి పి.వి. రమణ కుమార్ శ్రీనివాసరెడ్డి ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ అంకమ్మరావు ,ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బాలలపై ఆన్లైన్ వేధింపుల అరికట్టడమే లక్ష్యం






మంగళగిరి, సింధూరదర్శిని: బాలలపై ఆన్లైన్ వేధింపుల అరికట్టడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మరియు చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో బాలల కోసం సురక్షితమైన ఇంటర్నెట్ (వెబ్ సేఫ్ అండ్ వైస్) రాష్ట్రస్థాయి కార్యక్రమం ప్రారంభం. ఈ సందర్భంగా ఏ.వీ.ఎస్ వేటుకూరి. సూర్యనారాయణ రాజు చైర్ పర్సన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ వారు మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో బాలలు ఎదుర్కొంటున్న ఆన్లైన్ ముప్పులను సైబర్ నేరాలను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, మరియు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అయినా చైల్డ్ ఫండ్ ఇండియా భాగస్వామ్యంతో ఈ ప్రత్యేక రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించామని దీని ద్వారా బాలలపై జరిగే ఆన్లైన్ లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, ఆన్లైన్ వంచన మరియు డిజిటల్ బ్లాక్మెయిలింగ్, సైబర్ బుల్లియింగ్, వంటి ముప్పుల నుండి పిల్లలకు రక్షణ కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బలమైన సురక్షిత డిజిటల్ వ్యవస్థను నిర్మించడమే ఈ ఉమ్మడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్, మరియు రాష్ట్రస్థాయి యుహాహాత్మక మార్గదర్శకాల రూపకల్పన జరుగుతున్నదని, అదే విధంగా పాఠశాల విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగము, మరియు పోలీస్ శాఖ ఇతర సంబంధించిన శాఖలతో కలసి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ఈ వేధింపులకు సంబంధించి ఒక సర్వేను మరియు ఒక పరిశోధన కూడా నిర్వహిస్తామని తద్వారా ఈ ఆన్లైన్ వేధింపులకు గురయ్యే బాల బాలికల స్థితిగతులను తెలుసుకొని పరిష్కార మార్గాలను సూచిస్తామని, అదేవిధంగా పూర్తిస్థాయిలో తల్లి దండ్రులకు ఉపాధ్యాయులకు మరియు సమాజంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి ఈ కార్యక్రమం పై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి బాలలకు ఆన్లైన్ భద్రత అనేటటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తద్వారా బాలల ఆన్లైన్ వేధింపుల నుంచి విముక్తి కల్పించాలనేదే దీని యొక్క ముఖ్య ఉద్దేశమని చైర్పర్సన్ తెలియజేశారు. ఈ సందర్భంగా బాలల కోసం సురక్షితమైన ఇంటర్నెట్ అనేటటువంటి (బ్రోచర్ని) కరపత్రాన్ని ఆవిష్కరించుట జరిగినది.

ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఏ.వీ.ఎస్ వేటుకూరి. సూర్యనారాయణ రాజు, చైర్పర్సన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, సభ్యులు కే.జీ. వెంకట పద్మలత, మెంబర్ సెక్రెటరీ జి.ఉమాదేవి, చైల్డ్ ఫండ్ ఇండియా నుంచి అమర కుమార్ సింగ్, రీజనల్ లీడ్, ప్రోగ్రాం అండ్ పార్ట్నర్షిప్ సౌత్ అండ్ వెస్ట్ ఇండియా, అశోక్ కుమార్ పాండా. స్పెషలిస్ట్ ప్రోగ్రాం తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**యువత భవిష్యత్తును కాపాడుకోవాలి**

**సిహెచ్.వి మహేష్‌కుమార్**





విశాఖపట్నం, సింధూరదర్శిని:
రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం (ర్యాఫ్) ఉత్తరాంధ్ర జిల్లాల ప్లీనరీ సమావేశాలు సందర్భంగా "హలో యువత మేలుకో -- మత్తు పదార్థాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సుకు రాష్ట్ర నాయకులు పడమట నరేష్ స్వాగతం పలకగా విశాఖ జిల్లా కన్వీనర్ ఎన్ శ్రీను అధ్యక్షత వహించారు . విశాఖ జిల్లా కో కన్వీనర్ పయనం. రాజ్ విశాల్ వందన సమర్పణ చేయగా ఈ సభకు ఎన్ఫోర్స్మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చాజూ సి హెచ్, వి మహేష్ కుమార్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించి అమలులో ఉన్న చట్టపరమైన నిబంధనలను యువతకు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు, వాటి అక్రమ విక్రయాలు లేదా సరఫరా గురించి సమాచారం ఉంటే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.

రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం ఆఫ్ వై ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు , రాష్ట్ర కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి లు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరుగుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ప్లీనరీ సమావేశాలు సందర్భంగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత తమ శక్తి, ప్రతిభను విద్య, క్రీడలు, ఉపాధి, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించాలని సదస్సులో పిలుపునిచ్చారు. ఆర్ వై ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన సమస్యలపై ఉద్యమాలే కాక మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువతలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

"మత్తు కాదు... మన భవిష్యత్తే మనకు ముఖ్యం" అనే సందేశంతో యువతను చైతన్యపరిచే కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో RYSF రాష్ట్ర, ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు, విద్యార్థులు, యువత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది

**జూరాల నీటి విడుదలపై కేటీఆర్**

**జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం**

**పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్**

**రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య**



హైదరాబాద్ సింధూరదర్శిని: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

# పసిడి ధరలు మళ్లీ డౌన్.. తెలుగు రాష్ట్రాల్లో నేటి రేట్లు ఇవే!

**స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు**

**హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,53,320**

**22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,540గా నమోదు**

**రూ.100 తగ్గి కేజీ వెండి ధర రూ.2,49,900**

**తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఒకే విధంగా ఉన్న ధరలు**



బంగారం ధరలు బుధవారం ఉదయం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న పసిడి ధరల్లో నేడు స్వల్ప క్షీణత నమోదైంది. వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో ఉదయం 6 గంటల సమయానికి నమోదైన ధరల వివరాలు ఇలా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే, 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1,53,320 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ. 1,40,540గా ఉంది. ఇక 18 క్యారెట్ల బంగారం తులం ధర రూ. 1,14,990గా నమోదైంది. మరోవైపు వెండి ధరలోనూ తగ్గుదల కనిపించింది. కిలో వెండిపై రూ. 100 తగ్గి, ప్రస్తుతం రూ. 2,49,900 వద్ద ట్రేడ్ అవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, వరంగల్, ఖమ్మం, తిరుపతి, నెల్లూరులలో బంగారం ధరలు ఒకే విధంగా ఉన్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాలైన ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అయితే, బంగారం, వెండి ధరలు రోజంతా హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. కాబట్టి, కొనుగోలు చేసే ముందు వినియోగదారులు స్థానిక నగల దుకాణాల్లో ధరలను మరోసారి సరిచూసుకోవడం ఉత్తమం.

# వెల్లలచెరువులో నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ



అద్దంకి సింధూరదర్శిని: సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామంలో స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్నట్లు అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, అద్దంకి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వైవీ భద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో పాటు నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ ఎంపీలు నందిగం సురేష్, మోదుగుల వేణుగోపాలరెడ్డి పాల్గొననున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, గ్రామాల పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ అశోక్ కుమార్ కోరారు.

# భారత ఆర్థిక వృద్ధిపై గ్లోబల్ ఏజెన్సీలకు ఎందుకింత నమ్మకం?.. అసలు కారణాలివే!

**భారత్ వృద్ధి అంచనాలను పెంచిన ఎస్అండ్‌పీ, మూడీస్, ఫిచ్ – జూన్ త్రైమాసికంలో అంచనాలకు మించి 7.8 శాతం వృద్ధి**

**దేశీయ వినియోగం ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తున్న వైనం – ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకోవడం మరో కారణం**

**వృద్ధికి మద్దతిస్తున్న ఎగుమతుల్లో వృద్ధి – ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతున్న వేళ..**




భారత్ మాత్రం వృద్ధి బాటలో దూసుకెళుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించడంతో అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు తమ అంచనాలను వరుసగా పెంచుతున్నాయి. తాజాగా ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7 శాతానికి పెంచింది. ఫిచ్ కూడా తన అంచనాను 6.4 శాతం నుంచి 6.9 శాతానికి సవరించింది. గత వారం మూడీస్ కూడా 7 శాతం అంచనాను ప్రకటించింది.

**అంచనాలను మించిన జీడీపీ వృద్ధి**

ఈ మార్పులకు ప్రధాన కారణం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ వృద్ధి. పరిశ్రమల ఉత్పత్తి, వినియోగం, పెట్టుబడులు, వస్తువుల ఎగుమతులు బలంగా ఉండటం ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చాయి. ముఖ్యంగా పెట్టుబడులు 11.9 శాతం, గృహ వినియోగం 7.1 శాతం పెరిగాయి.

**వినియోగమే పెద్ద బలం**

భారత వృద్ధికి దేశీయ వినియోగం కీలకంగా మారింది. ప్రపంచ వాణిజ్యంలో ఒడుదొడుకులు ఉన్నా.. దేశంలో ప్రజల ఖర్చు కొనసాగుతోంది. కార్లు, ఇళ్లు, ప్రయాణాలు, ఆర్థిక సేవలు, ఇతర వినియోగ వస్తువులకు డిమాండ్ ఉండటం ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన మద్దతుగా నిలుస్తోంది. మూడీస్ కూడా బలమైన ప్రైవేట్ వినియోగాన్ని వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా పేర్కొంది.

**పెట్టుబడుల జోరు**

ప్రభుత్వ మౌలిక వసతుల వ్యయం ఇప్పటికే ఆర్థిక కార్యకలాపాలకు మద్దతిస్తోంది. అదే సమయంలో ప్రైవేట్ పెట్టుబడులు కూడా పుంజుకుంటున్నాయని ఫిచ్ పేర్కొంది. 2026–27లో పెట్టుబడులు 10 శాతానికి పైగా పెరగవచ్చని అంచనా వేసింది. జులైలో ఆహారేతర రుణాల వృద్ధి 19 శాతానికి చేరిందని తెలిపింది.

**బయట నుంచి షాక్‌లు.. అయినా వృద్ధి**

భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల పెరుగుదల, వాణిజ్యపరమైన ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్ వృద్ధి పెద్దగా దెబ్బతినలేదు. జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి దీనికి నిదర్శనమని ఫిచ్ పేర్కొంది. మూడీస్ కూడా మధ్యప్రాచ్య సంక్షోభం ప్రభావాన్ని భారత్ అంచనాల కంటే మెరుగ్గా ఎదుర్కొందని తెలిపింది.

**ఎగుమతులూ మరో ఇంజిన్**

వస్తువుల ఎగుమతులు కూడా వృద్ధికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ప్రస్తుతం భారత్ ఆర్థిక వ్యవస్థ ఒక్క వినియోగంపైనే ఆధారపడటం లేదు. దేశీయ డిమాండ్, ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడులు, ఎగుమతులు.. ఇలా పలు రంగాలు కలిసి వృద్ధికి ఊతమిస్తున్నాయి. ఎస్అండ్‌పీ కూడా గణనీయ వస్తువుల ఎగుమతులను జూన్ త్రైమాసిక వృద్ధికి కారణాల్లో ఒకటిగా పేర్కొంది.

**అయినా కొన్ని ముప్పులు**

వృద్ధి అంచనాలు పెరిగినంత మాత్రాన అన్నీ సాఫీగా సాగుతాయని కాదు. చమురు ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం, సాధారణం కంటే తక్కువ వర్షపాతం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎస్అండ్‌పీ 2026–27లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సగటున 5.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఆర్‌బీఐ పాలసీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచవచ్చని కూడా పేర్కొంది.

# వైభవ్‌కు అసలు పరీక్ష అక్కడే.. న్యూజిలాండ్ కోచ్ వాల్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**బౌన్సీ పిచ్‌లపై అతడి ఆటను చూడాలనుందన్న వాల్టర్ – ఒత్తిడిలో వైభవ్ ఎలా స్పందిస్తాడో తెలుసుకోవాలనుకుంటున్నట్లు వెల్లడి**

**న్యూజిలాండ్ పరిస్థితుల్లో వైభవ్‌కు ఎలా బౌలింగ్ వేయాలా అని ఆలోచిస్తున్నట్లు వ్యాఖ్య**

**అక్టోబర్ 22 నుంచి భారత్–న్యూజిలాండ్ టీ20 సిరీస్ – 2027 ప్రపంచకప్‌కు స్పష్టమైన ప్రణాళిక ఉందన్న కోచ్**




న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అసలు పరీక్ష ఎదురుకానుందా? బౌన్సీ పిచ్‌లపై అతడి బ్యాటింగ్‌ను చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ తెలిపాడు. అంతేకాదు.. ఓ కోచ్‌గా వైభవ్‌ను కాస్త ఒత్తిడిలో చూసి, అలాంటి పరిస్థితులను అతడు ఎలా ఎదుర్కొంటాడో తెలుసుకోవాలని రహస్యంగా కోరుకుంటున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

ఐపీఎల్ 2025, 2026 సీజన్లలో విధ్వంసక బ్యాటింగ్‌తో వైభవ్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది అండర్–19 ప్రపంచకప్‌లోనూ సత్తా చాటాడు. దాంతో జులైలో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. అయితే అఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20లు, జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడికి చోటు దక్కలేదు. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో వైభవ్‌కు అవకాశం వస్తే.. న్యూజిలాండ్ సీమ్ అనుకూల పరిస్థితుల్లో అతడి ఆటకు గట్టి పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది.

"బౌన్సీ వికెట్లపై వేగంగా వచ్చే బంతులను వైభవ్ ఎలా ఎదుర్కొంటాడో చూడాలని ఉంది. ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లపై అతడు ఆధిపత్యం చెలాయించడం చూశాం. ఇప్పుడు భిన్నమైన పరిస్థితుల్లో అది ఎలా మారుతుందో చూడాలి. మా పరిస్థితుల్లో అతడికి ఎలా బౌలింగ్ చేయాలో కూడా ఆలోచించాలి. ఓ కోచ్‌గా రహస్యంగా ఆటగాళ్లను కాస్త ఒత్తిడిలో చూడాలని అనుకుంటాం. అలాంటి పరిస్థితుల్లో వారు ఎలా స్పందిస్తారో తెలుసుకోవాలని ఉంటుంది" అని వాల్టర్ చెప్పారు. భారత్‌తో ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమేనని వాల్టర్ అన్నారు. స్వదేశంలో ప్రపంచకప్ విజేత భారత్‌తో ఐదు టీ20లు ఆడటం తమ ఆటగాళ్లకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఇక ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఎదురైన ఓటమి గురించి స్పందిస్తూ.. అది ఉన్నప్పటికీ ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన లేదన్నారు. న్యూజిలాండ్ తరపున గర్వంగా ఆడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళిక ఇప్పటికే స్పష్టంగా ఉందని వాల్టర్ తెలిపారు. రాబోయే ఏడాదిన్నరలో అవసరమైన చిన్న మార్పులు మాత్రమే చేస్తామని చెప్పారు.

# 320 కి.మీ వేగంతో వెళ్లేటప్పుడు ట్రాక్ మారితే బుల్లెట్ రైలు పట్టాలు తప్పదా?

**ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ట్రాక్‌లో ప్రత్యేక సాంకేతికత**

**బుల్లెట్ ట్రైన్ మార్గంలో 'క్యాంటెడ్ టర్నౌట్' అనే ప్రత్యేక వ్యవస్థ**

**మలుపుల్లో రైలు సాఫీగా వెళ్లేందుకు పట్టాలకు కొంత వాలు**

**ట్రాక్ మారే చోట కూడా ఈ వాలు కొనసాగేటట్లు క్యాంటెడ్ టర్నౌట్**

**సరైన స్థానంలో లాక్ చేసే 'పాయింట్ మెషీన్లు' కూడా కీలకం**



గంటకు 320 కి.మీ వేగంతో దూసుకెళ్లే రైలు.. ఊహించుకుంటేనే ఆసక్తిగా ఉంటుంది. కానీ ఇంత వేగంతో వెళ్తున్న సమయంలో ట్రాక్ మార్చాల్సి వస్తే? సాధారణ రైలులో ట్రాక్ మారేటప్పుడు చిన్నపాటి కుదుపు అనిపిస్తుంది. మరి బుల్లెట్ ట్రైన్ విషయంలో పరిస్థితి ఎలా ఉంటుంది? ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ట్రాక్ మార్చేలా ప్రత్యేక సాంకేతికతను ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్‌లో ఉపయోగిస్తున్నారు.

**ట్రాక్ మారేటప్పుడు ఏం జరుగుతుంది?**

రైలు ఒక పట్టా నుంచి మరో పట్టాలోకి వెళ్లే చోట ట్రాక్ ఆకారం మారుతుంది. సాధారణ రైళ్లు తక్కువ వేగంతో వెళ్లేలా ఈ ప్రాంతాన్ని రూపొందిస్తారు. వేగం పెరిగినప్పుడు పట్టాల మధ్య జరిగే ఈ మార్పు రైలుపై ఒక్కసారిగా ఒత్తిడిని పెంచుతుంది. దీంతో చక్రాలపై బలమైన ప్రభావం, కంపనలు ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే గంటకు దాదాపు రూ.320 కిలోమీటర్ల వేగంతో వెళ్లే బుల్లెట్ ట్రైన్‌కు సాధారణ విధానం సరిపోదు.

**కుదుపు తగ్గించే ప్రత్యేక పట్టాలు**

ఇందుకోసం బుల్లెట్ ట్రైన్ మార్గంలో 'క్యాంటెడ్ టర్నౌట్' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. మలుపుల్లో రైలు సాఫీగా వెళ్లేందుకు పట్టాలకు కొంత వాలు ఇస్తారు. ట్రాక్ మారే చోట కూడా ఈ వాలు కొనసాగేటట్లు క్యాంటెడ్ టర్నౌట్‌ను రూపొందించారు. దీంతో రైలు ఒక్కసారిగా దిశ మార్చినట్లు కాకుండా క్రమంగా మరో పట్టాలోకి వెళ్తుంది. ఫలితంగా ప్రయాణికులకు కుదుపులు, కంపనలు తక్కువగా అనిపిస్తాయి.

**రైలు మాత్రమే కాదు.. పట్టాలకూ మేలు**

ఈ వ్యవస్థ వల్ల ప్రయాణికుల సౌకర్యంతో పాటు రైలు చక్రాలు, పట్టాలపై పడే ఒత్తిడి కూడా తగ్గుతుంది. దాంతో చక్రాలు, పట్టాలు త్వరగా అరిగిపోకుండా ఉండే అవకాశం ఉంటుంది. ట్రాక్‌ను మార్చే భాగాలను కదిలించి సరైన స్థానంలో లాక్ చేసే 'పాయింట్ మెషీన్లు' కూడా కీలకంగా పనిచేస్తాయి. 320 కి.మీ వేగంతో నడిచే రైలుకు ఇవన్నీ అత్యంత కచ్చితంగా పనిచేయాల్సి ఉంటుంది. అందుకే సాధారణ రైల్వే వ్యవస్థలతో పోలిస్తే బుల్లెట్ ట్రైన్ ట్రాక్ నిర్మాణంలో మరింత కఠినమైన ప్రమాణాలు పాటిస్తున్నారు.

**508 కి.మీ మార్గంలో ఎన్నో ప్రత్యేకతలు**

ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ మార్గం 508 కి.మీ పొడవుతో నిర్మితమవుతోంది. మహారాష్ట్ర, గుజరాత్ మీదుగా సాగే ఈ మార్గంలో ఎనిమిది పర్వత సొరంగాలు ఉన్నాయి. అంత వేగంతో రైలు సొరంగంలోకి ప్రవేశించినప్పుడు గాలి ఒత్తిడి, శబ్దం పెరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రైలు బాడీ, చక్రాలు, ఇంజిన్ వ్యవస్థ, ఇతర కీలక భాగాలపై పరీక్షలు కొనసాగుతున్నాయి. తొలి దశలో సూరత్–వాపి మధ్య సుమారు 100 కి.మీ మార్గంలో 2027 ఆగస్టు 15న సేవలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే

హైదరాబాద్ సింధూరదర్శిని:

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది.

జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బరువు తగ్గాల్సిన అవసరం ఉందా?
## రాత్రి భోజనంలో అలాంటి ఆహారాలు తినండి..







చాలా మందికి బరువు పెరగడానికి ఇబ్బంది ఉండదు. కానీ బరువు తగ్గడం వారికి పెద్ద సమస్య. శరీర ఊబకాయం కారణంగా ఏదైనా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి వారు పట్టించుకోవడం లేదు. ఈ సమయంలో, వారు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తారు.

మార్కెట్లో లభించే బరువు తగ్గించే మాత్రలు, ఇతర వైద్యపరమైనవి తినడం ప్రారంభించినప్పుడు, మీరు తాత్కాలికంగా బరువు కోల్పోతారు, దాన్ని ఆపిన వెంటనే బరువు పెరుగుతారు. ఈ సమయంలో ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఇంటి నివారణలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

కొందరు త్వరగా బరువు తగ్గాలనే ఆశతో విందును కూడా దాటవేస్తారు. కానీ ఇది పరోక్షంగా బరువు తగ్గించే ప్రయత్నాలకు భిన్నంగా పనిచేయవచ్చు. ఇలా చేయడం వల్ల రాత్రి మీరు నిద్రపోకుండా చేస్తుంది. దాంతో రాత్రి మేల్కొని ఉండటానికి సహాయపడుతుంది మరియు అనారోగ్యకరమైన, అధిక కేలరీలు ఉన్న ఆహారాలను తినడం పెంచుతుంది.

ఇది మీ అభిరుచిని నాశనం చేయడమే కాదు, మరుసటి రోజు ఉదయం మీకు అలసట మరియు నీరసపరిచే అనుభూతిని కలిగిస్తుంది మరియు రోజు కార్యకలాపాలను నిర్వహించలేకపోతుంది. ఆహారం కూడా హెచ్చుతగ్గులకు లోనవుతుంది. అందువల్ల, బరువు తగ్గడానికి, మీరు బాగా నిద్రపోవాలి మరియు నిద్రించే ముందు మంచి పోషకమైన ఆహారాన్ని తినాలి. రండి, రాత్రిపూట తినగలిగే పది ఆరోగ్యకరమైన **ఆహారాన్ని చూద్దాం ...**

**చెర్రీస్**

ఇవి భోజనం తర్వాత ఆకలిని తీర్చడమే కాక, బాగా నిద్రపోవడానికి కూడా సహాయపడతాయి. చెర్రీస్ లో మెలటోనిన్ అనే పోషకాన్ని కలిగి ఉంటుంది, ఇది నిద్రను నియంత్రించడంలో సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లు దీనిని నివారించడంలో సహాయపడతాయి.

**పెరుగు:** వీలైతే గ్రీకు పెరుగు అయిన పెరుగును తీసుకురండి. ఇంట్లో స్వయంగా తయారుచేసే మోజారెల్లా కూడా మంచిది. రాత్రి భోజనంలో పెరుగు తీసుకోవడం మంచి ప్రోటీన్ మరియు తక్కువ చక్కెరను అంది స్తుంది. ప్రోటీన్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు రాత్రి సమయంలో కండరాలు పెరగడానికి సహాయపడుతుంది. ప్రోటీన్ శరీర కొవ్వును కరిగించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**వేరుశెనగ వెన్న:** బరువు తగ్గడానికి ఉత్తమ ఎంపిక ఏమిటంటే గోధుమ పిండితో తయారు చేసిన రొట్టె ముక్కపై వేరుశెనగ వెన్న లేదా వేరుశెనగ బటర్ పూత పూసి తినడం. పీనట్ బటర్ లో ప్రోటీన్ కండరాలను నిర్మించడానికి మరియు ఆరోగ్యకరమైన కడుపులను పూర్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది.

కాటేజ్ చీజ్ కూడా బరువు తగ్గడానికి రాత్రి పడుకునే ముందు తినడానికి గొప్ప ఆహారం. కేసిన్ ప్రోటీన్ అధిక మొత్తంలో కడుపు నిండుగా ఉంచుతుంది మరియు దెబ్బతిన్న కండరాలను సరిచేయడానికి సహాయపడుతుంది. ఇది కేలరీలను తగ్గిస్తుంది మరియు అవాంఛిత కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.

టర్కీ మాంసంలో లభించే ట్రిప్టోఫాన్ అనే పోషకం మీకు బాగా నిద్రించడానికి సహాయపడుతుంది మరియు రాత్రి బరువు తగ్గించేవారికి మంచి ఎంపిక. దీనిలోని ప్రోటీన్ కండరాలను నిర్మించడంలో సహాయపడుతుంది మరియు కొవ్వును కరిగించడం ద్వారా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. టర్కీని శాండ్‌విచ్ రూపంలో తినడం మంచిది.

**చాక్లెట్ మిల్క్:** కొవ్వును కరిగించడానికి చాక్లెట్ బ్లెండెడ్ పాలు కూడా చాలా బాగుంటుంది. పాలలో కాల్షియం బొడ్డు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం 1000 మిల్లీగ్రాముల కాల్షియం తీసుకోవడం వల్ల 18 పౌండ్ల కొవ్వు కరిగిపోతుంది. పాలలో విటమిన్ డి కాల్షియం గ్రహించడానికి సహాయపడుతుంది.



**బాదం:** ఇందులో ఐదు గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది దెబ్బతిన్న కండరాలను రాత్రి పూట రిపేర్ చేయగలదు. బాదంపప్పులో కరిగే ఫైబర్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు ఎక్కువగా తినకుండా నిరోధిస్తుంది. కొవ్వును కరిగించడానికి బాదం గొప్ప ఆహారం.

**అధిక ఫైబర్ ఆహారాలు**

అధిక మొత్తంలో కరగని ఫైబర్ ఉన్న ఆహారాన్ని రాత్రి తరచుగా తినాలి. అధిక ఫైబర్ తృణ ధాన్యాలు మంచి ఎంపిక. కరగని ఫైబర్ తీసుకోవడం కొవ్వును కరిగించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుందని ఒక అధ్యయనం కనుగొంది.

గ్రీన్‌టీ వల్ల అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రాత్రి భోజనం తర్వాత ఒక కప్పు గ్రీన్ టీ తీసుకోవడం ద్వారా, మీరు బరువు పెరగవచ్చు, అదే సమయంలో ఈ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. గ్రీన్ టీలోని కొన్ని పోషకాలు ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువ కొవ్వును కరిగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

గుడ్లలో ప్రోటీన్ మరియు ఇతర పోషకాలు అధికంగా ఉంటాయి మరియు రాత్రి భోజనంలో చేర్చడానికి మంచి ఎంపిక. ఒక పెద్ద గుడ్డు డెబ్బై ఎనిమిది కేలరీలను కలిగి ఉంటుంది మరియు ఇతర పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి ఈ వ్యాసం మీకు ఉపయోగకరంగా ఉందని మీరు భావిస్తే, మీ స్నేహితులతో పంచుకోండి.






# సినిమా న్యూస్

## 'డార్క్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



తమిళంలో రూపొందిన ఒక సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ ఇప్పుడు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. కె. జగన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, అజయ్ కార్తీ – అంచనా నేత్రున్ ప్రధానమైన పాత్రలను పోషించారు. జులై 3వ తేదీన విడుదలైన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చేసింది. అలాంటి ఈ సినిమా రీసెంటుగా తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.

విఘ్నేశ్ (అజయ్ కార్తీ) తన స్నేహితుడు చూసిన జాబ్ లో చేరడం కోసం 'చెన్నై' చేరుకుంటాడు. అద్దె తక్కువగా ఉన్న ఇంటి కోసం గాలిస్తూ, మొత్తానికి ఒక ఇంటిని పట్టుకుంటాడు. ఆ ఇంటి ఓనర్ కరుణాకర్ (భాగ్యరాజా). చాలా తక్కువ రెంట్‌కి డాబా పైపోర్షన్ రెంట్ కి ఇవ్వడానికి కరుణాకర్ అంగీకరిస్తాడు. గతంలో ఆ పోర్షన్ లో ముగ్గురు కుర్రాళ్లు రెంట్ కి ఉండేవారని విఘ్నేశ్ తో కరుణాకర్ చెబుతాడు. అయితే ఆ ముగ్గురులో 'జీవా' అనే యువకుడు, సతీశ్ – మోహన్ అనే ఇద్దరు స్నేహితులను దారుణంగా హత్య చేసి, తాను ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని అంటాడు.

ఆ తరువాత ఓ ఇద్దరు కుర్రాళ్లు రెంట్ కి వచ్చారనీ, కానీ ఆ ఇంట్లో దెయ్యాలు ఉన్నాయని చెప్పి పారిపోయారని అంటాడు కరుణాకర్. అప్పటి నుంచి దెయ్యాల భయంతో పై పోర్షన్ లోకి ఎవరూ రాలేదని చెబుతాడు. అతను గనుక పై పోర్షన్ లో రెంట్ కి ఉంటే, అక్కడ దెయ్యాలు లేవని ఊళ్లో వాళ్లు నమ్ముతారని అంటాడు. అప్పుడు తన ఇంటిని అమ్మేసి, సొంత ఊరుకు వెళ్లి హ్యాపీగా బ్రతకాలని అనుకుంటున్నట్టుగా చెబుతాడు. రెంట్ తక్కువగా ఉండటంతో, ఆ మర్నాడే ఆ పోర్షన్ లోకి విఘ్నేశ్ దిగిపోతాడు.

కరుణాకర్ కూతురు 'ప్రియదర్శి' కూడా తండ్రితో కలిసి అదే ఇంట్లో ఉంటూ ఉంటుంది. ఆమె చాలా దిగాలుగా ఉండటం విఘ్నేశ్ గమనిస్తాడు. ఆమెను గురించి కరుణాకర్ ఏమీ మాట్లాడకపోవడం కూడా అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రాత్రి వేళ కాగానే ఆ పోర్షన్ లో దానంతట అదే టీవీ ఆన్ అవుతూ ఉంటుంది. దోశలు పోసే ప్యాన్ .. ఒక బుక్ ఎగిరొచ్చి పడుతుంటాయి. టీవీ కనెక్షన్ తీసేసినా, ప్యాన్ – బుక్ ను పూడ్చేసినా అలాగే జరుగుతూ ఉంటుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ ముగ్గురు కుర్రాళ్లు ఎందుకు చనిపోతారు? విఘ్నేశ్ అక్కడి నుంచి సేఫ్ గా బయటపడతాడా? అనేది మిగతా కథ.

చెన్నైలోని ఒక ఇంట్లో ముగ్గురు కుర్రాళ్లు అనుమానాస్పద స్థితిలో చనిపోతారు. ఆ ముగ్గురూ దెయ్యాలై తిరుగుతున్నారని అంతా నమ్ముతుంటారు. ఆ విషయం తెలిసి కూడా అద్దె తక్కువగా ఉందని అందులోకి దిగుతాడు విఘ్నేశ్. ఇక అప్పటి నుంచి ఆ ఇంట్లో అతనికి ఎలాంటి భయంకరమైన అనుభవాలు ఎదురవుతాయి? ఆ పరిస్థితులను అధిగమించడానికి అతను ఏం చేస్తాడు? అక్కడి నుంచి అతను ప్రాణాలతో బయటపడతాడా లేదా? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం.

గతంలో ఏదో ఒక సంఘటన జరిగిన ఇంట్లోకి ఎవరో ఒకరు అద్దెకి దిగడం, అక్కడి ప్రేతాత్మలు వాళ్లని నానా రకాలుగా ఇబ్బందులు పెట్టడం వంటి కథలతో ఇంతకుముందు చాలానే సినిమాలు వచ్చాయి. ఈ కథలో ప్రేతాత్మలుగా మారిన వాళ్లు ఎవరు? అందుకు గల కారణం ఏమిటి? అనేదే ఆడియన్స్ ను వెయిట్ చేయిస్తూ ఉంటుంది. దెయ్యాన్ని నేరుగా చూపించకుండానే దర్శకుడు తెరపై కథానాయకుడిని .. ఆడియన్స్‌ను భయపెట్టే ప్రయత్నం చేస్తూ వెళ్లాడు.

ఆ ఇంట్లో అద్దెకి దిగిన ముగ్గురు కుర్రాళ్లు ఎందుకు చనిపోయారనే ఒకే ఒక్క విషయం తెలుసుకోవడం కోసమే, నిదానంగా సాగుతూ వచ్చిన ఈ కథను ఆడియన్స్ భరిస్తూ వెళతారు. అప్పటివరకూ అసలు విషయాన్ని ఎవరూ గెస్ చేయలేని కథేమీకాదు. కొంతమంది గెస్ చేయగలుగుతారు. అలాంటి పరిస్థితులలోనే ఫ్లాష్ బ్యాక్ ను రివీల్ చేస్తారు. దాంతో అప్పటివరకూ ఉన్న పట్టు సడలిపోయి, ఈ కథ మరింత బలహీనపడుతుంది.

నిజంగానే దెయ్యాలు హడావిడి చేస్తున్నాయా? లేదంటే ఇదంతా తన సైకలాజికల్ ఫీలింగా? అనే ఒక ఆలోచనలో .. అయోమయంలో కథానాయకుడు పడిపోతాడు. దర్శకుడు ఆడియన్స్ ను కూడా అదే అయోమయంలో పడేసే ఒక ప్రయత్నం చేశాడు. అందువలన ప్రయోజనం ఏమిటనేది మనకి అర్థం కాదు.

సాధారణంగా ఈ తరహా సినిమాల విషయంలో ఫొటోగ్రఫీ .. సౌండ్ ఎఫెక్ట్స్ ప్రధానమైన పాత్రను పోషిస్తూ ఉంటాయి. కానీ ఈ సినిమాలో అలాంటివేం లేవు. సహజత్వానికి ప్రాధాన్యతనిస్తూ వాటిని పక్కన పెట్టేశారు. రవిశక్తి ఫొటోగ్రఫీ .. మను రమేశన్ నేపథ్య సంగీతం .. కథిరేశన్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి.

ఈ సినిమాలో నాలుగు ప్రధానమైన పాత్రలు ఉన్నాయి. సరిగ్గా చెప్పాలంటే కథానాయకుడి పాత్ర ఒక్కటే ప్రధానమైనదని అనుకోవచ్చు కూడా. నాలుగు గోడల మధ్య ఏకపాత్రాభినయం ఎక్కువ. భయపడుతున్న హీరోను చూపించి మనలను భయపెట్టే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఒక రకంగా ఇదో ప్రయోగం అనుకున్నాడేమో. చీకటిని చూస్తూ మనం ఏది ఊహించుకుంటే అదే కనిపిస్తుందనేది నిజమే కావొచ్చు. కాకపోతే ఇక్కడ చీకటి లేదు .. చివరివరకూ దెయ్యము కనిపించదు. చివర్లో కనిపించినా మనకి భయమూ వేయదు .. కొన్ని దెయ్యాల కథలు అంతే!



## 'అలా అయితే ప్రీమియర్ షోకు దూరంగా ఉంటాం'..

### – సీఎం రేవంత్ స్పందనకు నాని రిప్లై –

'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో విషయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించడంపై హీరో నాని ధన్యవాదాలు తెలిపారు. గణేశ్ నిమజ్జనం ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పోలీసు శాఖపై ఎలాంటి అదనపు భారం మోపాలని తాము కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. భద్రత, జన సమూహ నియంత్రణ విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే.. థియేటర్ సందర్శనను రద్దు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోలీసు శాఖ తీసుకునే తుది నిర్ణయాన్ని గౌరవించి, దానికి అనుగుణంగా నడుచుకుంటామని నాని పేర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని థియేటర్‌లో అభిమానులతో కలిసి 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో చూసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని నాని కోరారు. దీనిపై సీఎం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. భద్రతా మార్గదర్శకాలను గౌరవిస్తున్నందుకు నానిని అభినందించారు. తెలంగాణ బిడ్డ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన 'ది ప్యారడైజ్'పై నానికి ఉన్న ఆసక్తిని ప్రశంసించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా, జన సమూహాన్ని నియంత్రించేందుకు నిర్దేశిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని సీఎం సూచించారు. దరఖాస్తును సంబంధిత పోలీసు బృందం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీని సీఎం ఆదేశించారు. తాజాగా సీఎం స్పందనకు నాని ధన్యవాదాలు చెబుతూ.. పోలీసుల తుది నిర్ణయాన్ని పూర్తిగా గౌరవిస్తామని స్పష్టం చేశారు.




# కుల మతాలకతీతంగా సమానత్వం కొరకు సింగల్

గూడూరు(సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; అయోధ్య రామ మందిర నిర్మాణంలో అశోక్ సింగల్ ఎంతో కృషి చేశారని దేశంలో కులమతాలకతీతంగా సమానత్వం కొరకు సింగల్ పాటు పడ్డారని గూడూరు విశ్వహిందూ పరిషత్ నాయకులు మురళి రెడ్డి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కేశవ నిలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అశోక్ సింగల్ శతజయంతి ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. వి హెచ్ పి నాయకులు మురళి రెడ్డి మాట్లాడుతూ అశోక్ సింఘాల్ దేశ సమైక్యత కొరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని శత జయంతి సందర్భంగా వచ్చే నెల నాలుగో తేదీన



కర్నూలులోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో విశ్వ హిందూ పరిషత్ అద్వర్యంలో విశిష్ట వ్యక్తుల సమావేశం జరుగుతుందని సమావేశానికి అందరూ హాజరు కావాలని పిలుపు నిచ్చారు. అయోధ్య రామ మందిరం నిర్మాణ ఉద్యమం కోసం అశోక్ సింఘాల్ దేశవ్యాప్తంగా అందరినీ చైతన్యపరిచారని, శతజయంతి సందర్భంగా వివిధ సామాజిక వర్గాలను, విశిష్ట వ్యక్తులను ఒక చోట కలిపే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకట రమణయ్య,మురళీ నాయుడు,తదితరులు పాల్గొన్నారు.




# వైభవంగా ధ్వజారోహణం

## ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం( సింధూర దర్శిని) 23 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమం వైభవంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో మరియు చైర్మన్, బోర్డు సభ్యులు ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం పై వర్క్ షాప్

గూడూరు (సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; స్థానిక ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామీణ ప్రాంత రిపోర్టర్లు, విద్యార్థుల కోసం జర్నలిజం కార్యశాలను గురువారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ తెలిపారు. జర్నలిజంలో భాగంగా వార్తలు రాసే విధానం, మెలకువలు, రిపోర్టింగ్ పద్దతులపై ఈ కార్యశాలలో అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆకాశవాణి తిరుపతి కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ హాజరై ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి కన్వీనర్గా చరిత్ర అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.వి. రమణారెడ్డి వ్యవహరిస్తున్నారు. కార్యశాలకు సంబంధించిన బ్రోచర్ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కిరణ్మయి ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఈ కార్యశాలకు అన్ని దినపత్రికల రిపోర్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# స్థానిక పోరులో 'కూటమి' ప్రభంజనం ఖాయం




**బుచ్చిరెడ్డిపాళెం 28 వార్డుల్లో మనమే గెలవాలి**

**పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతం చేసిన కేడర్‌కు అభినందనలు**

నెల్లూరు (సింధూర దర్శిని) 23 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో బుధవారం కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇటీవల కోవూరులో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన అత్యంత విజయవంతం కావడంపై కేడర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో పర్యటనలో దొర్లిన చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దిశా నిర్దేశం చేశారు.మైటీడీపీ యాప్' ద్వారానే నాయకులు, కార్యకర్తల పనితీరు అంచనా ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరును పారదర్శకంగా అంచనా వేసేందుకు అధిష్టానం 'మైటీడీపీ' యాప్‌ను ఉపయోగిస్తోందని తెలిపారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని, కేడర్ భాగస్వామ్యాన్ని తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున, నాయకులందరూ 'మైటీడీపీ' యాప్ వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, అవసరమైతే తెలిసిన నాయకుల వద్ద శిక్షణ తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో స్థానిక ఎన్నికలు మొదలైనా, అది తమ సొంత బాధ్యతగానే భావించి నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**బుచ్చిరెడ్డిపాళెం క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యం**

మొదటగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందరూ తమ సొంత ప్రాంతంగా భావించి కష్టపడాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచేలా కృషి చేయాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మంచి చేయడం తప్ప ఎలాంటి తప్పులు చేయలేదని, ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ రోజురోజుకూ దిగజారిపోతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కంటే దోచుకున్న కమీషన్లే ఎక్కువని అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక బుచ్చిరెడ్డిపాళెంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించామని, సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశామని గుర్తుచేశారు. మంగళవారమే హ్యామ్ పథకం కింద రూ.22 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి--67పై రూ.14 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం-చెన్నూరు రోడ్డు మధ్య మల్దేవి కెనాల్ పై వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయని, నూతనంగా అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోందని వివరించారు.

**వైసీపీ దోపిడీ వర్సెస్ కూటమి అభివృద్ధి**

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లు అడగవచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి రిజర్వాయరు లీకేజ్, సేపేజ్ అయ్యేలా గ్రావెల్ దోచేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయని, వాటిని త్వరలోనే పరిశీలించి అర్హులైన నిరుపేదలకు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు, సీనియర్ నాయకుల సూచనల మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అందరికీ ఒకేసారి అవకాశాలు ఇవ్వడం సాధ్యం కాదని అందరికీ తెలుసని, పోటీలో ఎవరు నిలబడ్డా పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ ఒక్కటై పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.



# అత్యంత వైభవంగా త్రిశూల స్నానం

కాణిపాకం (సింధూరదర్శిని) 23 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం వసంతోత్సవం మరియు త్రిశూల స్నానం అత్యంత వైభవంగా శాస్త్రోత్తంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , మరియు చైర్మన్ మణి నాయుడు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వసంత, కృష్ణవేణి, అనసూయ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

**సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 వరకు జాతర ఉత్సవాలు**

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**- సామాన్య భక్తులకు ప్రాధాన్యత**

**వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

**ట్రాఫిక్, క్రౌడ్, ప్రాసెషన్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి :జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు**

వెంకటగిరి (సింధూర దర్శిని) 23 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; వెంకటగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుదవారం వెంకటగిరి నగరం పింజలి వీరయ్య కళ్యాణ మండపం నందు జిల్లా కలెక్టర్ వెంకటగిరి ఎమ్మెల్యే కొరుగొండ్ల రామకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ బానుప్రకాష్‌రెడ్డి, పోలేరమ్మ ఆలయ చైర్మన్ గొల్లగుంట మురళి కృష్ణ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ మరియు శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ దేవస్థానం ప్రత్యేక అధికారి విజయరాజు, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వెంకటగిరి పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ఘటోత్సవంతో జాతర ప్రారంభమై, సెప్టెంబర్ 30న అమ్మవారి ప్రధాన ఉత్సవం, అక్టోబర్ 1న నిలువు, నిష్క్రమణ కార్యక్రమాలతో జాతర



ముగుస్తుందని వివరించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున గత సంవత్సరాల్లో ఎదురైన చిన్నచిన్న సమస్యలను సమీక్షించి, ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్యూ మేనేజ్‌మెంట్, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా సుమారు 1,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. వీఐపీ దర్శనాలను ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా సమయాన్ని నిర్ణయించామని, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.'స్త్రీ శక్తి' పథకాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల రవాణా కోసం గత సంవత్సరం 90 బస్సులు ఏర్పాటు చేయగా, ఈ సంవత్సరం 150 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.వెంకటగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఎదురైన చిన్నచిన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల సంఖ్య గతంలో కంటే 30 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకుని క్యూ లైన్లు, పార్కింగ్, ట్రాఫిక్ మార్గాలను ముందుగానే ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం బస్సులు సరిపోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని కోరినట్లు, సుమారు 50 అదనపు బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వడమే ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భక్తులు క్రమపద్ధతిలో క్యూ లైన్ల ద్వారా వెళ్లి ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.రూ.300 దర్శన టికెట్లను ముందుగానే కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని, భక్తులు ముందుగా టికెట్ తీసుకుని ప్రత్యేక క్యూ లైన్ ద్వారా దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. ఎవరినీ ఇబ్బంది పెట్టే విధంగా గుంపులుగా క్యూ లైన్లలోకి తీసుకురాకుండా చూడాలని కోరారు. ఈసారి జాతరలో రూ.40 లక్షలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొనేలా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు సాంస్కృతిక కార్యక్రమాల వేదికపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ద్వారా అభిప్రాయ సేకరణ నిర్వహించగా, 81 శాతం మంది కాలేజీ గ్రౌండ్‌లో కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా అభిప్రాయం వ్యక్తం చేసినందున ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా వేదికను కాలేజీ గ్రౌండ్‌కు మార్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. జాతరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, ప్రాసెషన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన మార్గాలను ముందుగానే నిర్ణయించి ట్రాఫిక్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లను అవసరమైన మేరకు పొడిగించి, భక్తులు లోపలికి వెళ్లే సమయంలోనే కాకుండా దర్శనం అనంతరం బయటకు వచ్చే సమయంలో కూడా రద్దీ లేకుండా చర్యలు తీసు కుంటున్నట్లు వివరించారు. చివరి రథోత్సవం, ఊరేగింపు సమయంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. విద్యుత్, మున్సిపల్, ఫైర్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని రహదారులు, విద్యుత్ సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662